క్లుప్తంగా

గౌరీ శంకరునికి అన్నాభిషేకం



గౌరీ శంకరునికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురష్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. గౌరీ శంకరునికి పంచామృతాభిషేకం, అన్నాభిషేకం పూజలను విశేషంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చల్లా భగీరథ రెడ్డి సేవలు చిరస్మరణీయం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న గుడిపల్లె సురేంద్ర

కర్నూలు (టౌన్): దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేంద్ర అన్నారు. గురువారం నగరంలోని అమ్మ వృద్ధుల అనాథ ఆశ్రమంలో చల్లా భగీరథ రెడ్డి జయంతిని పురస్కరించుకొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహానికి విలువ ఇచ్చి స్నేహితుల అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి చల్లా అని కొనియాడారు. ప్రచారం లేని సేవలు ఎన్నో చేశారన్నారు. మంచి చేసే వ్యక్తులను స్మరించుకోవాలన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న మేనేజర్, చిన్నారులు

కర్నూలు (టౌన్): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. గురువారం స్థానిక ఖానా–ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వచ్చే నెల 21వ తేదీ నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా సంఘం కార్యదర్శి అవినాష్, కోచ్ అక్షర, మునిస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

కర్నూలులో సీపీఎం సమైక్యతా ర్యాలీ



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జిల్లా పరిషత్ నుంచి పాతబస్తీలోని అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖరుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. భారతదేశంపై ఉగ్ర దాడులను ప్రతిఘటించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని, అదే సమయంలో మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు పౌరులు ఏకం కావాలన్నారు. బీజేపీ మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఏమి లాభంలేదని విమర్శించారు. మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. నాయకులు పీఎస్‌రాధాకృష్ణ, కేవీ నారాయణ, ఎండీ ఆనంద్‌బాబు, విజయ, గురుశేఖర్, అలివేలమ్మ, అరుణమ్మ, వై.నగేష్, అబ్దుల్లా, రాఘవేంద్ర, షరీఫ్, రామకృష్ణ, అబ్దుల్‌దేశాయ్, సీహెచ్‌సాయిబాబా, కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.ప్రభాకర్, స్వాములు, జయమ్మ, శ్యామలమ్మ, వేణు, సుభాన్, రమణ, భాస్కర్, యేసు, ఉషేన్‌బాషా పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు


హొళగుంద: మండలంలోని ఎల్లార్తి షెక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని రాత్రి అక్కడే నిద్రించి నైవేద్యాలు సమర్పించారు. అలాగే.. హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డిసాయిబాబా ఆలయాలకు భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విటమిన్ 'డి' లోపిస్తే దిగాలే!

- ఆరోగ్యానికి విటమిన్ – డి ఎంతో అవసరం
- తక్కువైతే శారీరక సమస్యలు
- 60 శాతం మందిలో లోపం
- రోజూ కాసేపు ఎండలో ఉంటే మేలు

కర్నూలు(హాస్పిటల్): ఒళ్లంతా నొప్పులుగా ఉన్నాయా.. శరీరం అలసిపోయినట్లుగా అనిపిస్తోందా.. తరచూ డిప్రెషన్ ఎదురవుతోందా.. ఎముకలు గుల్లబారుతున్నాయా.. అయితే మీలో విటమిన్–డి లోపం ఉందేమో ఓసారి పరీక్ష చేయించుకోండి. ఎందుకంటే ఇటీవల కాలంలో చాలా మందిలో ఈ విటమిన్ లోపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణాల్లో ఉండే వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. దీనికి కారణం ఎండలో కాసేపు ఉండకపోవడమేనని వైద్యులు చెబుతున్నారు. సూర్యుడి నుంచి ఉచితంగా లభించే విటమిన్–డిని సైతం శరీరం గ్రహించుకోలేని పనిలో ఉండటం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.

ఈ సృష్టిలో ప్రతి మనిషికీ అన్ని రకాల విటమిన్లు అవసరం ఉన్నట్లే సూర్యుడి నుంచి ఉచితంగా లభించే విటమిన్–డి కూడా ముఖ్యమే. సూర్యుడి నుంచి ఉచితంగా లభించే ఈ విటమిన్‌ను చాలామంది పట్టించుకోవడం లేదు. తీరా అది తక్కువయ్యాక మందుల దుకాణాల్లో మాత్రల రూపంలో కొనుగోలు చేసి వాడాల్సిన పరిస్థితి. ఈ విటమిన్ ఎముకల జీవక్రియకు అవసరమైన హార్మోన్ ఉత్పత్తికి, కండరాలు, ఎముకలు బలంగా ఉండేందుకు, రోగనిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉండేందుకు, మన శరీరంలోని కణజాలాలు బలోపేతంగా ఉండేందుకు ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటి కీలకమైన విటమిన్–డి పట్ల పట్టణాల్లోని చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎంతగా అంటే జనాభాలోని సగానికి పైగా ఈ సమస్య ఉండేంత.



విటమిన్ డి లోపం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలు



విటమిన్ డి లభించే ఆహార పదార్థాలు

అనేక సమస్యలకు మూలం

విటమిన్–డి ఎముకల ఆరోగ్యాన్ని పెంచడంలోనే గాకుండా తినే ఆహారం నుంచి కాల్షియం శోషించడంలో కూడా సహాయపడుతుంది. ఫ్లూ వచ్చే ప్రమాదాన్ని కూడా ఇది తగ్గిస్తుంది. అయితే ఈ విటమిన్ లోపం వల్ల మన శరీరంలో అనేక శారీరక, మానసిక సమస్యలకు కారణం అవుతోంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ లోపం ఎవరికైనా రావొచ్చు. దీని కారణంగా చర్మ సంబంధిత సమస్యలు, జుట్టు రాలడమే గాక, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు కూడా తలెత్తుతాయి. దీనిని పొందాలంటే కాసేపు ఎండలో ఉండాలి. విటమిన్–డి ముఖ్యంగా చేపలు, గుడ్లు, పుట్టగొడుగులు, కాడ్‌లివర్ ఆయిల్ వంటి పదార్థాల్లో లభిస్తుంది.

విటమిన్–డి లోపిస్తే లక్షణాలు

తరచూ అనారోగ్యానికి గురికావడం, తరచూ అలసిపోవడం, కృంగుబాటు (డిప్రెషన్), కండరాలు బలంగా లేకపోవడం, ఎముకల్లో నొప్పులు, జుట్టు రాలడం, చర్మ సంబంధిత సమస్యలు (మొటిమలు, వృద్ధాప్య ఛాయలు, చర్మం పగలడం, బొల్లి), నిద్రలేమి, ఊబకాయం, చిన్నపిల్లల్లో రికెట్స్ (కాళ్లు వంకర పోవడం), పుర్రె సొట్టపడటం, ఎముకలు తేలిగ్గా విరగడం, షుగర్ నియంత్రణలో లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్న వారు వైద్యులను కలిసి పరీక్ష చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలి.

ఉదయాన్నే నడిస్తే ఎంతో ప్రయోజనం

ప్రతి ఒక్కరూ సూర్యుడు ఉదయించే సమయంలో వాకింగ్ చేస్తే ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఆ సమయంలో సూర్యుడి లేలేత కిరణాల్లో విటమిన్–డి పుష్కలంగా ఉంటుందని చెబుతారు. ఈ మేరకు శరీరానికి విటమిన్–డి అందడంతో పాటు వాకింగ్ చేయడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. కొన్ని రకాల క్యాన్సర్లను సైతం వాకింగ్‌తో దూరం చేయొచ్చని వారు సూచిస్తున్నారు.

మారిన జీవనశైలే కారణం

ఆధునిక జీవన విధానం వల్ల మనిషి జీవనశైలి మారుతోంది. ఉరుకులు, పరుగుల జీవనంలో అటు ఆహారంతో పాటు నిద్రవేళలు కూడా మారిపోతున్నాయి. ఫలితంగా పలు రకాల అనారోగ్యాలు మనిషిని వెంటాడుతున్నాయి. ఇందులో విటమిన్–డి లోపం కూడా ఒకటి. గతంలో ప్రతి ఒక్కరూ ఉదయం వేళల్లో ఎండలో ఉండేవారు. ఇప్పుడు చాలా మంది నిద్రలేవడానికే ఉదయం 8 గంటలు దాటుతోంది.

దీనికి తోడు కార్యాలయాల్లో పనిచేసే వారు అధిక భాగం ఏసీల్లో ఉంటున్నారు. ఎక్కువ మంది కార్యాలయాల్లోకి సూర్య కిరణాలు కూడా సోకని పరిస్థితి ఉంది. ఈ కారణంగానే కాస్త ఎండ వేడిమి కూడా భరించలేకపోతున్నారు. పిల్లలు సైతం ఇదే పరిస్థితుల్లో జీవిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ చదువుల కారణంగా వారికి ఆటలు దూరమయ్యాయి.

విటమిన్–డి ఎంతో అవసరం



పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ విటమిన్–డి ఎంతో అవసరం. ఇది లోపిస్తే కండరాలు, ఎముకలు బలహీనపడతాయి. దీనికి తోడు వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. ఈ విటమిన్ పొందాలంటే ప్రతి ఒక్కరూ సూర్యరశ్మిలో కాసేపు గడపాలి. విటమిన్–డి మరింత తక్కువగా ఉంటే వైద్యుల సూచనల మేరకు కొంత కాలం పాటు మందులు వాడాల్సి ఉంటుంది. – డాక్టర్ సి.మంజునాథ్, ఆర్థోపెడిక్ వైద్యులు, కర్నూలు

పలు వ్యాధిగ్రస్తులకు అవసరం



విటమిన్–డి పలు రకాల వ్యాధిగ్రస్తులకు అవసరం అవుతుంది. ముఖ్యంగా ఎముకలు, కండరాలు బలహీనంగా ఉన్న వారితో పాటు ఉత్సాహంగా ఉండేందుకు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, గుండె జబ్బు లున్న వారికి, ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి ఇది బాగా పనిచేస్తుంది. దీనికితోడు చేపలు, కాలేయం, కోడి, గుడ్లు, పాలు, పన్నీరు, నెయ్యి, వెన్న, పుట్టగొడుగులు వంటి ఆహారాల్లోనూ ఇది లభిస్తుంది. –డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

పండ్ల దుకాణాల్లో తనిఖీ



దెబ్బతిన్న పండ్లను చెత్త బండిలో వేయిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ వద్ద ఉన్న పలు పండ్ల దుకాణాల్లో గురువారం ఆహార నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్, కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఫోరం సెక్రటరీ శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ముఖ్యంగా వై.బి. ఫ్రూట్స్ దుకాణంలో మామిడి, ఆపిల్ పండ్లను పరిశీలించి పలు పండ్లను శ్యాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించారు. అలాగే అలి బ్రదర్స్ ఫ్రూట్స్ కమిషన్ ఏజెంట్ దుకాణంలో పండ్లను పరిశీలించారు. ఆయా దుకాణాల్లో మామిడి, ఆపిల్, అరటి, కర్బూజా, బొప్పాయి పండ్లను నిల్వ చేసిన విధానాన్ని పరిశీలించారు. ఇందులో కర్బూజా, బొప్పాయి పండ్లు దెబ్బతిని ఉండటంతో వాటిని మున్సిపల్ చెత్త వాహనంలో వేయించారు. పలు మామిడి పండ్లు సైతం కుళ్లిపోయి ఉండటంతో వాటిని సైతం చెత్తకుండీలో వేశారు. మరో దుకాణంలో అరటి పండ్లపై ఏసీ రూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇథిలిన్ గ్యాస్ చల్లుతుండటంతో హెచ్చరికలు చేశారు. పలు ఆపిల్ పండ్లపై మైనం ఉన్నట్లు అధికారులు గమనించారు. ఇలాంటి పండ్లను తినడం వల్ల అల్సర్లు, జీర్ణకోశ వ్యాధులు వస్తాయని రాజగోపాల్ హెచ్చరించారు. పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ వాడకూడదన్నారు. అధికారుల దాడుల నేపథ్యంలో సమీపంలోని పలు దుకాణాలను వ్యాపారులు బంద్ చేసి వెళ్లిపోయారు.

దళిత కుటుంబంపై దాడి చేసిన ఉన్మాదిని అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): దళిత కుటుంబంపై దాడి చేసిన ఉన్మాదిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు పరిధిలోని సూర్యనారాయణ దేవాలయం వెనుక ఉన్న బాలాజీ నగర్‌లో బుధవారం సాయంత్రం వీరన్న అలియాస్ పెద్ద వీరారెడ్డి అనే తాగుబోతు 81/337 నంబరు గల ఇంట్లోకి చొరబడి మహిళలపై దాడికి పాల్పడ్డాడు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

కర్నూలు (టౌన్): మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సోమిశెట్టి నగర్‌కు చెందిన రామకృష్ణ ఓ ప్రైవేటు స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని కూరగాయలు కొనేందుకు సి.క్యాంప్ రైతుబజార్‌కు వెళ్లాడు. కొనుగోలు చేసిన తర్వాత వచ్చి చూస్తే ద్విచక్ర వాహనం కనిపించలేదు. వెతికినా ఎక్కడా కనిపించకపోవడంతో మూడో పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

బంగారు దుకాణంలో గొలుసు చోరీ

కర్నూలు (టౌన్): బంగారం కొనేందుకు ఓ మహిళ షాపుకు వెళ్లి యజమానిని మాటల్లో దింపి బంగారు గొలుసును కొట్టేసింది. ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పాత బస్టాండ్ షరాఫ్ బజార్‌లోని 28వ షాపులో బంగారు నగలు కొనుగోలు చేసేందుకు ఓ మహిళ వెళ్లింది. బంగారు గొలుసులు చూస్తున్నట్లు నటించి ఓ గొలుసును కొట్టేసి అక్కడినుంచి జారుకుంది. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగింది. సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా ఆ మహిళ బంగారు గొలుసును కొట్టేసినట్లు గుర్తించిన వ్యాపారి ప్రదీప్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేయర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్

కర్నూలు (టౌన్): నగర మేయర్ బీవై రామయ్యను గురువారం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెలగపూడి సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రెండు రోజుల క్రితం బదిలీపై డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మేయర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రూబెల్లాతో పుట్టబోయే బిడ్డకు ముప్పు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): గర్భంతో ఉన్న మహిళకు రూబెల్లా సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, దీని మూలంగా బిడ్డకు కంటి లోపాలు, వినికిడి లోపం, మెదడు, గుండె సంబంధిత లోపాలు కలుగుతాయని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. కొన్ని సందర్భాల్లో గర్భస్రావం, మృత శిశువు జననం జరుగుతుందన్నారు. గురువారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలోని సచివాలయంలో తల్లులు, గర్భవతులకు తట్టు, రూబెల్లా టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. తట్టు ప్రాణాంతక వ్యాధి అని, దీని వల్ల చిన్నారులు న్యూమోనియా, విరేచనాలు, మెదడువాపు వ్యాధులకు గురవుతారన్నారు. ఒక్కోసారి మరణానికి కూడా దారి తీస్తుందని తెలిపారు. దగ్గడం, తుమ్మడం, తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే 9 నుంచి 12 నెలల వయస్సులో చిన్నారులకు మొదటి డోసు, 16 నుంచి 24 నెలల వయస్సులో రెండో డోసు తప్పనిసరిగా టీకా ఇవ్వాలని సూచించారు. టీకా వల్ల చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో వారికి తట్టు రాకుండా ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



డీఈఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు

కర్నూలు(అర్బన్): గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ హెచ్చరించారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉల్చాలలో నీటి సమస్య పరిష్కరించాలని పలు మార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకపోయిందని చెప్పారు. కూటమి పార్టీలకు ఓట్లు వేస్తే తమ సమస్య పరిష్కారం అవుతుందని నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అయితే వారి ఆశలన్నీ ఆడియాసలయ్యాయని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా, నేటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికీ 10 నుంచి 20 రోజులకోసారి మంచినీటిని విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా డీఈఈ అమల, ఏఈ రంగస్వామి స్పందిస్తూ.. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి ప్రకాష్, గ్రామ కార్యదర్శి హరికిషన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జేసీ, ఆప్కాబ్ డీజీఎంకు సత్కారం



జేసీ నవ్యను సత్కరిస్తున్న డీసీసీబీ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా విశేషంగా సేవలందించిన జేసీ నవ్యను, సీఈఓగా బాధ్యతలు నిర్వహించిన విజయకుమార్‌ను బ్యాంకు అధికారులు ఘనంగా సత్కరించారు. 18 నెలలుగా సీఈఓగా ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన తిరిగి ఆప్కాబ్‌కు వెళ్లేందుకు సీఈఓ బాధ్యతల నుంచి వైదొలిగారు. సాయంత్రం డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో సీఈఓగా బాధ్యతల నుంచి రిలీవ్ అయిన విజయకుమార్‌ను బ్యాంకు అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ, అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ నవ్య హాజరయ్యారు. సీఈఓగా సమర్థవంతంగా సేవలందించిన విజయకుమార్‌ను అభినందించారు. డీసీసీబీ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులైన నేపథ్యంలో ఇంతవరకు ఈ బాధ్యతలు నిర్వహించిన జేసీని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రామాంజనేయులు, డీసీఓ ఎస్.రామాంజనేయులు, జీఎం శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వర రెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీపై వెలసిన షాపు



ప్రకాశ్‌నగర్ ఉర్దూ స్కూల్ వద్ద డ్రైనేజీపై ఏర్పాటు చేసిన షాపు

కర్నూలు (టౌన్): ప్రతి రోజు తనిఖీలకు వెళ్లే నగరపాలక కమిషనర్ డ్రైనేజీలపై నిర్మాణాలు ఉండరాదని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, సచివాలయాల ప్లానింగ్ సిబ్బంది తనిఖీలు చేసి డ్రైనేజీలపై ఉన్న నిర్మాణాలు, ఆక్రమణలు, షాపులను తొలగించాలని పదే పదే చెబుతున్నారు. అయితే ఇవేవీ షాపుదారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై, డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా మున్సిపల్ సిబ్బంది తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా నగరపాలక సంస్థ పరిధిలోని 49వ వార్డు ప్రకాశ్‌నగర్‌లో ఉర్దూ స్కూల్ ప్రాంగణంలోనే డ్రైనేజీ కాల్వపై షాపులు ఏర్పాటు చేస్తున్నారు. షెడ్డు పనులు పూర్తి చేసుకున్నారు. అదే ఏరియాలో ఉదయం, మధ్యాహ్నం విధులు నిర్వహించే శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీ, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయాల సిబ్బందికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. వీటిని మున్సిపల్ అధికారులు తొలగిస్తారో? లేదో? వేచి చూడాల్సిందే.

సదరంలో దాహం.. దాహం



సదరం క్యాంపులో పనిచేయని తాగునీటి ప్లాంటు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన సదరం క్యాంపులో దివ్యాంగులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఓ కార్పొరేట్ సంస్థ విరాళంగా ఇచ్చిన తాగునీటి ప్లాంటును మంత్రి టీజీ భరత్ ఘనంగా ప్రారంభించిన కొద్ది రోజులకే మూలనపడింది. వాటర్ ప్లాంట్‌కు అనుసంధానంగా సదరం భవనంపై ఉన్న ట్యాంకు నుంచి నీటిని సేకరించి వాటిని శుద్ధీకరిస్తారు. అనంతరం ప్లాంటు ద్వారా స్వచ్ఛమైన నీటిని తాగేలా అవకాశం కల్పించారు. కానీ గత కొన్ని రోజులుగా ఈ ప్లాంటు పనిచేయడం లేదు. భవనంపైన ఉన్న ట్యాంకుకు నీరు చేరకపోవడం వల్లే ప్లాంటుకు నీరు అందక మూలన పడినట్లు అక్కడి సిబ్బంది చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్లాంటుకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)



ఎస్టీబీసీ కళాశాల వద్ద టీడీపీ జెండాలతో ఆర్టీసీ బస్సులు



కర్నూలు ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రయాణికులకు 'మహా' కష్టాలు

కర్నూలు (సిటీ): వైఎస్సార్ కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడుకు ఆ పార్టీ కార్యకర్తలు, మహిళలను తరలించేందుకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను మళ్లించారు. దీంతో గత రెండు రోజులుగా జిల్లాలోని వివిధ బస్టాండ్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కర్నూలు నుంచి పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికుల కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. అందుబాటులో ఉన్న బస్సుల్లో సీట్ల కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం వేలాది మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ విషయం తెలిసినా తెలుగుదేశం తమ పార్టీ కార్యక్రమానికి బస్సులను మళ్లించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కర్నూలు నుంచి గుత్తి, అనంతపురం, తిరుపతి, కడప, గుంటూరు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సైతం బస్సులు లేకుండా పోయాయి. ఉన్న బస్సులలో సీట్లు దొరకక ప్రమాదకర రీతిలో ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రయాణికులు విసుగు చెందారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులు గాకుండా ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన వాహనాలను వినియోగించుకోవాలని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడ్డారు.





బస్సులో సీట్లు పట్టుకునేందుకు ప్రయాణికుల అవస్థలు

కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలి నియామకం

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బి.హైమావతిని నియమించారు. ఈ మేరకు గురువారం ఆమెకు కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అనంతరత్నం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానీ బాషా పాల్గొన్నారు.